# పేదలకు సేవ చేస్తే దేవుళ్లకు చేసినట్లే


- ఉచితంగా మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్స చేయడం అభినందనీయం
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్



పేషెంట్‌కు పండ్లు పంపిణీ చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్, పక్కన మేయర్ వై సునీల్‌రావు, రెనే దవాఖాన చైర్మన్ బంగారి స్వామి-రజినీ ప్రియదర్శిని దంపతులు

విద్యానగర్, అక్టోబర్ 13: పేదలకు సేవ చేస్తే దేవుళ్లకు చేసినట్లేనని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. నగరంలోని రెనే దవాఖానలో చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి శ్రీలక్ష్మి మహేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పది మంది పేదలకు ఉచితంగా మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్స చేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 8న 10 మందికి శస్త్ర చికిత్స చేయగా, శుక్రవారం డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, వైద్యం అత్యంత ఖరీదైన నేటి రోజుల్లో నయా పైస లేకుండా లక్షలాది రూపాయల విలువైన వైద్య సేవలు పేదలకు ఉచితంగా అందించి, తమ దాతృత్వాన్ని చాటుకుంటున్న వైద్యులు బంగారి స్వామి-రజినీ ప్రియదర్శిని దంపతుల సేవలు అభినందనీయమని కొనియాడారు. రూ. 22 లక్షల విలువైన మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్సను పేదలకు ఉచితంగా చేయడంతో పాటు మందులు, రవాణా, భోజన ఖర్చులు, పండ్లు కూడా అందజేయడం వైద్య దంపతుల ఉదార స్వభావాన్ని తేటతెల్లం చేస్తోందన్నారు. వీరిని మిగితా వైద్యులు ఆదర్శంగా తీసుకొని పేదలకు ఉచిత వైద్య సేవలందించాలని ఆకాంక్షించారు. దవాఖాన చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ, తన తల్లి ప్రోత్సాహంతో వైద్య వృత్తిలోకి అడుగిడి సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. తల్లి చేసిన సూచన మేరకు ఏటా పది మంది నిరుపేదలకు ఉచితంగా మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్స అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. తన సేవలో భార్య డాక్టర్ రజినీతో పాటు కుమారులు కూడా సహకరిస్తుండడంతో రెట్టించిన ఉత్సాహంతో తాను ఉచిత శస్త్ర చికిత్సలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ముమ్ముందు ప్రతి ఆరునెలలకోసారి ఉచిత శస్త్రచికిత్సల శిబిరం ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. డాక్టర్ రజినీ ప్రియదర్శిని మాట్లాడుతూ, మా కుటుంబ సభ్యుల పేరిట పేదలకు ఉచితంగా మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్స, సంతానం లేని వారికి ఐవీఎఫ్ పద్ధతిలో సంతానం కలిగిలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి-హరిశంకర్, మధుసూదన్‌రెడ్డి, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రాచారి, డాక్టర్లు మునీష్, నిఖిల్ లక్ష్మణ్, దామోదర్‌రెడ్డి, దినకర్, దీక్షిత్ బొజ్జా, యోగెందర్, కార్పొరేటర్ మేచినేని వనజ-అశోక్‌రావు, మేకల అరవింద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

### 15 ఏళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నా



15 ఏళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ ఎన్నో దవాఖానలు తిరిగినా తగ్గలేదు. రెండు లక్షల దాకా ఖర్చు చేసుకున్నా, ఫలితం లేదు. రెనే దవాఖానలో రూపాయి ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశారు. మందులు కూడా ఫ్రీగానే ఇచ్చారు. గతంలో నాలుగడుగులు వేయాలంటే నరకయాతన పడేదాన్ని, ఇప్పుడు ఎలాంటి ఆధారం లేకుండా నడుస్తుండడం ఆనందంగా ఉంది. **-ఇమ్మడి శారద, కరీంనగర్**

### ఈ డాక్టర్లు నాకు దేవుళ్లతో సమానులు



ఎన్నో దవాఖానలు తిరిగినా నాకు మోకాళ్ల నొప్పులు తగ్గలేదు. ఐదేళ్ల నుంచి పడుతున్న బాధను వారం రోజుల్లో ఈ డాక్టర్లు తగ్గించి, నాకు, నా కుటుంబానికి దేవుళ్లుగా మారారు. వారి సేవలను నా జీవితంలో మర్చిపోలేను. ఇలాంటి డాక్టర్లు కలకాలం జీవించాలి. మాలాంటి పేదోళ్లకు ఉచితంగా వైద్యమందించాలి. బంగారి స్వామీరజినీ దంపతులకు కృతజ్ఞతలు. **-బోడ కొమురమ్మ, తీగలగుట్టపల్లి**

### జీవితంలో నడవలేననుకున్నా



నేనే అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తూ, కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఆరేళ్లగా మోకాళ్ల నొప్పులతో అవస్థలు పడుతున్నా. అప్పులు చేసి చికిత్స పొందినా తగ్గలేదు. రెనే దవాఖాలో ఉచితంగా ఆపరేషన్ చేసిండ్రు. ఎలాంటి ఆధారం లేకుండా నడువగలుగుతున్నా. ఉచితంగా లక్షల రూపాయల వైద్యమందించిన బంగారు స్వామి-రజినీ డాక్టర్లకు జీవితాంతం నేను, నాకుటుంబం రుణపడి ఉంటాము. **-అడ్లూరి రాములు, అంబులెన్సు డ్రైవర్, గోదావరిఖని**

### ప్రత్యక్ష దేవుళ్లు అయ్యారు



పదేళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నా. రెండు చంక కర్రలతో అడుగులు వేయాల్సిన దుస్థితి నాది. ఖరీదైన వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతుండగా, నాకు ఉచితంగా కీలు మార్పిడి చేసిన వైద్యులు బంగారు స్వామి-రజినీ ప్రత్యక్ష దేవుళ్లు అయ్యారు. ఇలాంటి డాక్టర్లుంటే మాలాంటి పేదోల్ల బతుకులు మారుతయి. **-ఎనగందుల లక్ష్మణ్, సుందరగిరి**

# కార్మిక చట్టాల అమలుకు కృషి

కలెక్టరేట్/తెలంగాణ చౌక్, అక్టోబర్ 13: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన చట్టాలు పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేస్తానని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ సామ్యూల్ జాన్ తెలిపారు. వరంగల్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటారు రవాణా రంగ సంస్థలు, సహకార సంఘాలు, ధర్మాదాయ, ఇతర ట్రస్టుల్లో పని చేసే కార్మికులకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా క్షేత్రస్థాయిలో పని చేస్తానని వెల్లడించారు. ఆయా సంస్థలు కూడా కార్మికులకు నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. 18 ఏళ్లలోపు వారిని పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎనిమిది గంటల పని విధానం మాత్రమే అమలు చేయాలని, అదనంగా పని చేయిస్తే అదనపు వేతనం విధిగా చెల్లించాలన్నారు. హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లు, దాబాల్లో మహిళా కార్మికులతో రాత్రి 8 గంటల వరకే పని చేయించుకోవాలని, అనంతరం కూడా కొనసాగిస్తే తనిఖీలు చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులకు కనీస వేతనాలు తప్పనిసరిగా అమలు చేయాలని, వారాంతపు సెలవులు కూడా మంజూరు చేయాలన్నారు. అలాగే, బోనస్ విధిగా అందజేయాలన్నారు. సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతో పాటు ప్రతి ఒక్కరి పేరిట వెల్ఫేర్ ఫండ్ డిపాజిట్ చేయాలని ప్రైవేట్ రంగ సంస్థల యజమానులను కోరారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి, పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ అధికారులు ఎం కోటేశ్వర్లు, రాజేశ్వరమ్మ, కార్మిక శాఖ అధికారులు చక్రధర్‌రెడ్డి, శ్రీకాంత్, అనిల్, కృష్ణ సాగర్, హేమలత, కార్మికశాఖ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సామ్యూల్ జాన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్మిక శాఖ సిబ్బంది

## ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి



మండల కేంద్రంలో సౌకర్యాలను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రఫుల్ దేశాయ్

గంగాధర, అక్టోబర్ 13: ఎన్నికల నిబంధనలను అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రఫుల్ దేశాయ్ సూచించారు. మండలంలోని మధురానగర్‌లో శుక్రవారం ఆయన మోడల్ కోడ్, ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో రాజకీయ పార్టీలు, నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు, గోడలపై రాతలు, వాల్ పోస్టర్లు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఇండ్లపై పార్టీల జెండాలు ఉంటే సంబంధిత ఇంటి యజమాని నుంచి రాజకీయ నాయకులు అనుమతి తీసుకున్నారా లేదా అని పరిశీలించాలన్నారు. ఎన్నిలక కోడ్‌ను అతిక్రమించే వారిపై చట్టపరంగా కేసు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో ఆధారాలు లేకుండా రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు తరలిస్తే సీజ్ చేసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అప్పగించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో ఎన్నికల సిబ్బందికి వసతి కల్పించడానికి సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు, నియోజకవర్గంలోని ఆరు మండలాల సీఐలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సీడీపీవోలు, ఎస్ఐలు, సెక్టార్ అధికారులు, ఎఫ్ఎస్‌టీలు, ఎస్ఎస్‌టీలు, వీఎస్‌టీలు, ఎంసీసీలు పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు

రాంనగర్, అక్టోబర్ 13: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టినట్లు అడిషనల్ డీసీపీ పరిపాలన రాజు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలీస్, రెవెన్యూ అధికారులు, ఎన్నికల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ, ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి మహేశ్వర్ మాట్లాడుతూ, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రణాళిక బద్ధంగా విధులు నిర్వహించాలన్నారు. కరీంనగర్ వన్, టూ, త్రీ టౌన్‌ల ఇన్‌స్పెక్టర్లు రవి కుమార్, రామచంద్రారావు, శ్రీనివాస్, కరీంనగర్ అర్బన్, రూరల్, కొత్తపల్లి తహసీల్దార్లు రమేశ్, నవీన్, రాజేశ్, ఎంపీడీవో దివ్యదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి, అక్టోబర్ 13: రాష్ట్ర స్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలకు నగరంలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కొత్తపల్లిలోని బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో విద్యా సంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. చిరుప్రాయం నుంచే వారి అభిలాషకు తగినట్లు సూచనలు చేస్తే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు ఉంటాయన్నారు. కాగా, విద్యార్థులు ఆర్ కార్తీక్, ఎస్ అజయ్, జీ అంజి మనీశ్వర్ రెడ్డి, శివాజీ చారి, మనిచంద్, సిరిచరణ్‌కు పుష్పగుచ్ఛాలతో పాటు అర్హత పత్రాలను అందజేసి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరానికి వలంటీరు ఎంపిక

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 13: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ సెలక్షన్స్‌లో ఎస్సారార్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-4 వలంటీరు ఎం కీర్తి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ తెలిపారు. కాగా, కీర్తి శుక్రవారం ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. టీజీసీజీటీఏ రాష్ట్ర సెక్రటరీ సురేందర్ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు సురేశ్ కుమార్ నాయుడు, చంద్రమౌళి, శారద, వరప్రసాద్, మహేశ్ పాల్గొన్నారు.



కీర్తిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు